



# కార్తీక దీపాలు

'భో' మంటూ మునిసిపాలిటీ సైరను మోగుతోంది. సాయం సంధ్య వెన్నెల చీరను కప్పుకోవడానికి సిద్ధపడుతోంది.

శాంత నీళ్ళబిందె గుమ్మం ముందు పెట్టి చెంబుకోసం లోపలి గదిలో స్విచ్ వేసింది ఆ అద్దెకొంప నాక్రమించుకున్న దోమలు వెలుగుకి కోపంతో విజృంభిం

చాయి. వంటింట్లోనుండి చెంబు తీసుకుని, గుమ్మం ముందు చిన్న గో లే ల్లో వేసిన మొక్కలకు నీళ్ళు పొయ్యడం, ఆమె దినకృత్యాల్లో ఒకటి.

'రోజూ నీ ళ్ళు పో స్తు న్నా యీ మొక్కలు యెదగటంలేదు. కారణం బోధ పడటం లేదు.' శాంత మనస్సులోనే అను కుంటూ నీళ్ళు పోయటం ప్రారంభించింది. నిజమే. గులాబీ, చా మం తీ, మల్లె మొక్కలు వీధుల వెంట అమ్మకానికి వస్తే అపురూపంగా కొని పెంచుతోంది. లోగిల్లో పశువుల బారిపడకుండా కంటికి రెప్పలా కాపాడుతోంది. కానీ మొక్కలు చాలా నీరసంగా పెరకువలేక వాడినట్లు కన్పిస్తున్నాయి ఆమెకు.

"అమ్మా...." అన్న పెద్ద కొడుకు హరికేకతో వర్తమానంలోకి వచ్చింది. హరి అరవ తరగతి చదువుతున్నాడు.

"యేం బా బూ! అలాగున్నావ్" అడిగింది.

"యేం లేదమ్మా! యివాళ బళ్ళో ఆటలాడించేరు. నేను ఆడలేక పోయా నమ్మా! గుండెల్లో నొప్పి వచ్చింది. అప్పుడేమో మేష్టారు నన్ను మానిపించి 'ఒరేయ్ చాలా బలహీనంగా వున్నావు. మంచి టానిక్ తాగు, బాగా తినరా' అన్నారమ్మా" అన్నాడు సంచీ యింట్లో పెట్టి కాళ్ళు కడుక్కుంటూ. శాంత గుండెల్లో రాయిపడింది. వాణ్ణి దగ్గరగా తీసుకుని తల నిమిరింది.

"కాస్త మంచి నీళ్ళు త్రాగు బాబూ, అదే సర్దుకుంటుంది," అంది కొంచెం బాధతోనే, భర్తకోసం వీధివేపు దృష్టి సారిస్తూ. కానీ శాంతకు సారథి రావటం కన్పించలేదు. కానీ ఇద్దరు పిల్లలు, పాణి, రవి బిలబిలమంటూ పరుగెట్టుకు వస్తున్న దృశ్యం కనిపించింది.

"నెమ్మదిగా రండి. పరిగెట్టకండి పడి పోతారు" అని కేకేసింది. యిద్దరూ దగ్గరకు వచ్చారు.

"మా యిద్దర్నీ రేపు స్కూలుకు రావొద్దన్నారమ్మా! కదురా తమ్ముడూ!" అని పాణి రవివంక చూసాడు.

'అవునమ్మా!' అన్నాడు రవి. యిద్దగా కట్టుకున్న బట్టలూ మాసి ఉన్నాయి. శాంత ఆశ్చర్యపోయింది.

"యెందువల్లనా! రేపు శలవా ....'

"శలవు కాదమ్మా! మరి మాకు యూనిఫారమ్ బట్టలు లేవుగా. స్కూల్లో అందరికీ ఉన్నాయి. మాకే లేవమ్మా, అందుకని టీచరుగారు రావొద్దనేశారు" అన్నాడు పాణి డిగాలు ముఖం వేసు కుంటూ. పాణి, రవి, వరుసగా ఐదో క్లాసూ రెండో క్లాసు చదువుతున్నారు.

"రేపు కుట్టిస్తాలేరా. నాన్నగారితో చెప్పి...." అంది బాధగానే.

"ఆ! రోజూ యిలాగే చెబుతు న్నావు...." అన్నాడు పాణి. శాంత రోజూ యిలాగే వాయిదావేస్తూ వాళ్ళని బడికి పంపిస్తోంది. అప్పటికే సారథి

ఒకసారి వెళ్ళి టీచర్లకు చెప్పివచ్చాడు. యిలాంటి విషయాల్లో శాంతకు వాయిదాల కన్న సంతృప్తికరమైన హామీ యింకోటి కన్పించలేదు.

"అమ్మా నాన్నగారు లెఖ్ఖల పుస్తకం, సాంఘిక శాస్త్రం తీసుకొస్తా నన్నారే, తెచ్చారా. బళ్ళో మరెవ్వరూ పుస్తకాలు యివ్వటం లేదే" అంటూ హరి పుస్తకాలు ముందు వేసుకుని చదవటం ప్రారంభిస్తూ ప్రశ్నించాడు.

"లేదు బాబూ, యివాళ తీసుకొస్తారేమో...." అంది బస్తాకు అడుగూ, మడుగూ బొగ్గులగుండని కుంపట్లోవేస్తూ.

"అమ్మా ఆకలేస్తోందే...." అన్నాడు రవి.

"అమ్మా నాకూ్కూడానే..." అన్నాడు రెండో వాడు.

"కాస్సేపు ఆగండి బాబూ! నిప్పు చేసి వంటచేస్తానుగా....' అంది మనస్సులోనే కుములుతూ. నిజంగా నిప్పుచేస్తే దానిమీద మరగడానికి ఆ యింట్లో నీళ్ళు మాత్రమే వున్నాయి. అందుకనే సారధికోసం ఆమె ఎదురుచూస్తున్నది లోకజ్ఞానంలేని పసిపిల్లలకు యేమి చెబితే అర్థం అవుతుంది.

"పోనీ పైసలియ్యవే, ఏమైనా కొనుక్కుంటాం" అడిగాడు రెండో వాడు. వాడొక్క పిసరు ఆకలికి ఓర్చుకోలేడు.

శాంత ఆత్రంగానే పోపుల పెట్టె వెతికింది. అందులో ఐదు పైసల బిళ్ళ దొరికింది. వాళ్ళిద్దరూ పెన్నిధి దొరికినంత సంబరపడిపోతూ, దానిని తీసుకుని పరిగెత్తుకుంటూ కొట్టుకు వెళ్ళారు. శాంత కుంపటిమీద నీళ్ళు పడేసి హరి దగ్గర కూర్చుంది. వాడు శ్రద్ధగా చదువుతున్నాడు, చిరిగిన చాపమీద కూర్చుని. రెండోవాడి పుస్తకాలు తీసింది యేమీ తోచక. తొమ్మిదో క్లాసు వరకూ తను చదివిన చదువు గుర్తుకు వచ్చింది. పిల్లలిద్దరూ చేరో బిస్కత్తు తినేసి, మంచి నీళ్ళుత్రాగి తల్లిదగ్గర కూర్చుని పుస్తకాలు తీసారు.

"అమ్మా! తన కోపమే తన శత్రువు తన శాంతమే తనకు రక్ష అంటే ఏమిటి...." అడిగాడు తల్లిని.

"తన కోపమె తన శత్రువు అంటే..." ఉత్సాహంగా అర్థంచెప్పబోతున్న శాంత ఆగిపోయింది.

గది గుమ్మం ముందొకామె నిల్చుని ఉంది. ఆమె చేతిలో పెద్ద పాకెట్టు ఉంది. ఆమె వెనకాల ఇరుగు పొరుగు స్త్రీలు ఉన్నారు.

శాంత ఆశ్చర్యపోయింది. లేచింది, పైట భుజం నిండుగా కప్పుకుంటూ. "మీకోపమేనండీ శాంతగారూ! కార్లో వచ్చారు...."అంది పొరుగావిడ 'కార్లో' అన్న శబ్దం వొత్తిపలుకుతూ

"రండి.... రండి...." అని తడబడుతూనే ఆహ్వానించింది. ఆమె లోపలికి వచ్చింది. శాంత ఆమెను చూసింది.

చాలా ఖరీదయిన ధర్మవరం పట్టుచీర కట్టుకుంది. ఆ వెలుగులో దేవతలా మెరిసిపోతోంది. శాంతకు ఆమెను యింట్లో యెక్కడ కూర్చోపెట్టాలో తెలియలేదు. విరిగిపోయిన ట్రంకుపెట్టి, నులక తెగిపోయిన కుక్కి మంచం రెండే వున్నాయి.

"క్షమించండి. మిమ్మల్ని...." చెప్ప లేకపోయింది శాంత.

"ఫర్వాలేదమ్మా, నేను చాప మీద కూర్చుంటాను...." అంది పిల్లల ప్రక్కన కూర్చుంటూ.

"చాలా థేంక్సండీ. మీరు సారథి యిల్లు చూపినందుకు" అంది, గుమ్మం పట్టుకుని వేళ్ళాడుతున్న ఆడవాళ్ళని ఉద్దేశించి, వెళ్ళమన్న ధ్వనితో. అప్పటికి శాంతకి అర్థమయింది, ఆమె సారధికి బాగా తెలుసునని. వంటింట్లోకి నడవ బోయింది శాంత.

"నువ్వేమీ నా గురించి శ్రమపడ కమ్మా! వీళ్ళు నీ పిల్లలా" అంది పాకెట్టు పెద్ద బిస్కట్ల ప్యాకెట్టు వాడి చేతిలో పెడుతూ.

"యేం చదువుతున్నారు బాబూ...." అంది చిన్నవాడిని వొడిలోకి తీసుకుంటూ, వాళ్ళ పేర్లు అడిగిన తర్వాత.

"నేను రెండోక్లాసు చదువుతున్నా.." గర్వంగా చెప్పాడు ఆఖరివాడు బిస్కట్ల ప్యాకెట్టు మీద బొమ్మల్ని చూస్తూ.

"వాడ్ని కింద కూర్చోబెట్టండి, వాడు మురికిగా వున్నాడు" అంది శాంత సిగ్గుతో.

"ఫర్వాలేదు" అంటూనే బిస్కట్ల ప్యాకెట్టు విప్పి పంచింది.

"యింతకీ నేనెవరని నీవు ఆశ్చర్య పోతున్నావు కదూ! నేను నీకు అక్క నవుతాను చెల్లీ!.... నాపేరు కమల" అంది. శాంత వింతగా చూస్తోంది. దబ్బ పండు ఛాయలో, రవ్వల కర్ణాభరణా లతో, సంస్కారం, ఐశ్వర్యం కల బోసిన ఔన్నత్యంతో అందంగా, సౌమ్యంగా ఉందామె. చంద్రవదనం లాంటి ఆమె ముఖారవిందంలో యేదో లోటు, చిన్నతనం నుండి ముందూ వెనుకా యెవ్వరూ లేకుండా బ్రతికిన శాంతహృదయం కమల అప్యాయతతో స్పందించింది. దూరంగా కూర్చో బోతున్న శాంతను దగ్గరగా కూర్చో బెట్టుకుంది.

"నేనూ - సారధీ చిన్నతనం నుండి అరసవెల్లిలోనే వుండి చదువుకున్నాం. యిరుగు పొరుగు యిళ్ళే మావి. నీకు నా గురించి చెప్పలేదా!" అడిగింది.

శాంత గుర్తు తెచ్చుకోవడానికి ప్రయ త్నిస్తోంది. సారధి యిన్నేళ్ళ సాహ చర్యంలో తనతో, తను యెలా చిన్నతనంనుండే జీవితంలో అష్టకష్టాలు పడ్డాడో చెప్పాడు. కానీ కమల విషయం ప్రస్తావించినట్టు గుర్తులేదు.

"యెప్పుడొస్తాడు మీ ఆయన ఆఫీసు నుండి...."

"కొంచెం ఆలస్యమవుతుంది. ఎనిమిది గంటల ప్రాంతంలో వొస్తా రండీ...."

"అండీ .... గిండీ తీసిపెట్టి నన్ను అక్కా అని పిలువు చెల్లీ...." అంది శాంతచేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"యేమీ తీసుకోనంటున్నా రక్కా, కనీసం మంచినీళ్ళయినా...." అర్థోక్తి లోనే ఆగిపోయింది. పిల్లలు గుమ్మం దగ్గర నిల్చుని బిస్కట్లు, ఆకలితో వున్నారేమో ఆవురావురుమని తింటు న్నారు. శాంత వెనకాలే వంటింట్లోకి నడిచింది కమల. చనువుగా. పీట వేసు కుని కూర్చుంది. గాజు గ్లాసులో మంచినీళ్ళు యిచ్చింది.

నేను నీ ఇంటికి భిక్ష అడగటానికి వచ్చాను. నాకు భిక్ష పెడతావు కదూ చెల్లీ...." అంది నీళ్ళు త్రాగి. శాంతకు ఆమాటల అర్థం బోధపడనట్లుగా ఆమె వేపు చూసింది.

"అవునమ్మా? నీకున్న బిడ్డల్లో వొకరిని నాకు పెంపకానికి ఇవ్వాలి" అంది. కుంపటిమీద గిన్నెలో నీరు హోరుమన్న శబ్దంతో మరుగుతోంది. శాంతకు నోట మాట రాలేదు.

"అవునమ్మా! వొకానొక ధనికురాలిగా రాలేదు. విద్యావంతురాలిగా రాలేదు. జీవితంలో అందర్నీ పోగొట్టు కున్న నాకు యింక ముందుదారి చీకటే మిగిలింది ఆ చీకటిలో నీ కొడుకు చిరుదీపం కావాలి. అందుకనే నీ హృదయ ప్రాంగణంలో మమతల అంచుల మధ్య నిలబడి, భిక్షుకిగా నిన్నర్థి స్తున్నాను." అంది కమల, ప్రాధేయ పూర్వకంగా. ఆమె కంఠం గాద్గదిక మయింది. శాంతకు మనస్సు వుడికిపో తోంది. తన ఇంటి దీపాల్ని, తన కంటి వెలుగుల్లో వొకదాన్ని యిచ్చివేయ మంటోంది. యెందు కివ్వాలీ. ఆమె ఎవరు? తాము యెవరు? అంత డబ్బు గలామెకు పిల్లల్ని దత్తుయివ్వడానికి 'క్యూలో' నిలబడతారే తల్లిదండ్రులు. కానీ యెందుకీమె తన బిడ్డల్నే అడుగు తోంది. శాంత మనసు ప్రశ్నలు, వాటి సమాధానాలు వెతుకుతున్నాయి.


"ఏమంటావ్ చెల్లీ....నా యీ కోరిక మన్నించు .... నీ కొడుకును నా కంటి పాపలా చూసుకుంటాను ...." అంది శాంతలోని ఆలోచనల్ని ఛేదిస్తూ

"మీరు వార్ని కలిసారా!" అడిగింది నీరసంగా.

"ఆ కలిసాను. కలవలేదు...." అంది తడబడుతూ.

"అంటే...." అర్థంకాలేదు శాంతకు.

"నేను తను పనిచేస్తుండే అఫీసుకు వెళ్ళాను. కాస్సేపు విజిటర్స్ రూంలో మాట్లాడుకున్నాం చాలా సంవత్సరాల తర్వాత. కాని అప్పటికి సారధి వివరాలు





నాకు తెలియదు. పని ఎక్కువగా ఉన్నదని ఆఫీసులోకి వెళ్ళిపోయాడు. ఇంద్రోతు సాయంత్రో.... నీ యింటికి వచ్చాను....” అంది మరేం మాట్లాడాలో తెలియక.

“మీ కోరిక విషయంలో వార్ని అడిగి చూడండి. నేనేం చెప్పగలను. యింటికి యజమాని వారు....” అంది కొంత సహనంతో కోపాన్ని అణుచుకొంటూ.

“సారధి నడిగితే వొప్పుకోడు.... చెల్లీ .... నీవే అతనిని వొప్పించడానికి ప్రయత్నించాలి. ముఖ్యంగా కన్నతల్లివి. నీవు అంగీకరించాలి.... కొంగు పట్టుకుని నీముందు నిలబడుతున్నాను. నాకీ భిక్ష ప్రసాదించు చెల్లీ ....” కన్నీరు తుడుచుకుంటూ.

“ఛీ అదేమిటక్కా కన్నీరు....” అంటూనే శాంత, కమలను ఓదార్చింది.

"రేపు ఉదయం వస్తానమ్మా! యెలాగా ఆదివారం కదా! సారధిని అంగీకరింప జేయి" అంటూ బిడ్డల్ని ముద్దాడి వెళ్ళిపోయింది.

శాంత అచేతనంగా గుమ్మందగ్గర కూర్చుండిపోయింది. అవతల గుడ్డి వెన్నెల్లో మొక్కలు కన్పిస్తున్నాయి. అలా యెంతసేపు వుండి ఆలోచనల సముద్రంలో ప్రయాణించిందో శాంతకు గుర్తులేదు.

"యేమిటీ దేవిగారు ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నారా" అన్న భర్త పిలుపుతో వర్తమానంలోకి వచ్చింది.

"యేమింతాలస్యం...." అంటూనే చేతిలో బియ్యం సంచీ, కూరల సంచీ అందుకుని వంటింట్లోకి నడిచింది.

"యేంలేదు. ఊళ్ళో అప్పు పుట్టేసరికి యింతాలస్యం అయింది. అన్నట్టు రేపు యింటద్దె యిచ్చేసేయి." అంటూనే చొక్కా విప్పి పెరట్లోకి నడిచాడు.

అన్నీ వుంటే వంట యెంతసేపు. భోజనా లయినతరువాత వంటిల్లంతా సర్ది, పిల్లల్ని పడుకోబెట్టి, గుమ్మంమీద తలగడ వేసుకుని పడుకున్న సారధి పక్కన కూర్చుంది. సారధి తాంబూలం వేసుకోడు.

"యేమిటండీ. యేదో ఆలోచిస్తున్నారు" అడిగింది శాంత.

"ఆఁ .... ఆఁ .... యేంలేదు" తడబడ్డాడు సారధి.

"యివాళ అక్కయ్య వచ్చి వెళ్ళిందండి...." అంది యిద్దరి మధ్య నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ. భర్త యేం ఆలోచిస్తున్నాడో శాంతకు తెలుసు.

"నాకు తెలియని అక్కయ్య నీ కెక్కడుందబ్బా...." అడిగాడు నవ్వి, ఆమె దొండపండు పెదాల మీద చూపుడు వేలుంచి.

"మీకు తెలియని బంధువులు నా కుండగూడదా?"

"వుండొచ్చు .... యింతకీ యెవరో చెబుదూ .... యేదో బీరకాయపీచు సంబంధమా? వుండమనలేకపోయావా? ...యెక్కడ దిగింది?...."అని ప్రశ్నలు వొకసారే శరపరంపరలా వొదిలేసాడు

"అన్నీ అడిగారు గానీ, ఆమె పేరు అడగలేదు...."

"ఇంతవరకూ వచ్చిన తర్వాత చెప్పడం మానవుకదా...."

"ఆమె పేరు కమల" అంది నవ్వి. తేలుకాటు తిన్నవాడిలా చివ్వున లేచాడు సారధి.

"యేమిటీ! ఆమె యిక్కడికి వచ్చిందా, యెప్పుడూ" అన్నాడు కోపంతో. అతని ముఖం అరుణిమను పులుముకోవడానికి సిద్ధంగా వుంది.

"అవునండీ! ఒక గంటసేపు వుంది. యెంతో మంచావిడలా వుంది. చాలా

కలుపుగోరుతనంగా చెల్లీ చెల్లీ అంటూ ....మాట్లాడింది" అంది, ఆప్యాయతను గుర్తుకు తెచ్చుకుంటూ.

"అసలు నువ్వెందుకు లోపలికి రానిచ్చావ్?"

"అదేమిటండీ! మీ చిన్ననాటి స్నేహితురాలవి చనువుగా లోపలికి వచ్చి కూర్చుంటే పొమ్మంటానా? భలేవారే..."

"సరే యింక ముందు యెప్పుడూ ఆమెను లోపలికి రానివ్వకు...." అన్నాడు కోపంగా.

"పాపం ఆమె కష్టాల్లో వున్నట్టు వుందండీ! భర్త పోయాడు. బోలెడంత ఆస్థి. జీవితంలో ఆమెకు ఎవ్వరూ వున్నట్టు లేరు...."

"మనం మాత్రం కష్టాల్లో లేమా! యెవరో కష్టాల్లో గూడా మంచి కష్టాలూ, చెడ్డ కష్టాలూ వుంటాయి అంటుంటారని సామెత. అయినా ఆమె గురించిన సమస్యలతో మనకేం పని...." అన్నాడు నిర్లిప్తంగా.

"మళ్ళా రేపుదయం వస్తానందండి. ఆమె నన్నొక కోరిక కోరిందండీ...."

"యేమిటది...."

"యేంలేదు. మన పిల్లల్లో యెవర్నయినా పెంచుకుంటానని మీతో చెప్పి అంగీకరింపజేయమని...."

శాంత మాట పూర్తికాకుండానే ఆమె చెంప చెళ్ళుమంది. సారధి కోపంతో వణికిపోతున్నాడు. శాంతకు నోటిమాట రాలేదు యిన్నేళ్ళ కాపురంలో భర్త ఆవేశపరుడయినా మాత్రం తనమీద చెయ్యి చేసుకోలేదు.

"యింకా యేం అడిగింది? చెప్పు...."

శాంత కళ్ళమ్మంట నీళ్ళు తిరిగాయి. శాంత అడ్డంగా దీనంగా తలూపింది. కాసేపు ఇద్దరిమధ్యా నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"నన్ను క్షమించు శాంతా!" అన్నాడు సారధి. అవనతవదనయైవున్న భార్య చుబుకం పైకెత్తి ఆమె కనుల్లోకి చూస్తే అవి శ్రావణమేఘాల్లా వర్షించడానికి సిద్ధంగా వున్నాయి.

"నీకు తెలీదు శాంతా! ఆమె....ఆమె స్త్రీ కాదు. నా జీవితాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి .... జీవితంలో ఆమె చేసిన గాయం మానుకుని మామూలు మనిషిగా చాలా దూరంలో బ్రతుకుతున్నా యివాళ మళ్ళా ఆ గాయం చెలరేగింది. దాని బాధను తట్టుకోలేకపోయాను. నిన్ను కొట్టాను. నన్ను క్షమించు." ఆమె చేతుల్లో ముఖం పెట్టుకుని కన్నీరు కారుస్తున్నాడు.

"మీరేం తప్పు చేయలేదండీ! నేనే యెక్కడో పొరబడ్డాను...."

"నీకు యిప్పుడేనా ఆమె గురించి నిజం చెప్పాలి. నా గురించి మిగిలిన నిజం నా జీవిత దృశ్యాలు నీకు చెప్పాలి పూర్తిగా" అని ఆవేశంగా ప్రారంభించాడు.

* * *

అరసువెల్లిలో కమలా సారధులవి యిదుగు పొరుగు యిళ్ళు. కొంచెం దూరపు చుట్టరికం గూడా ఉంది. కమలది కలిగిన కుటుంబం. అస్థికి ఏకైక వారసు రాలు. గుమస్తా కొడుకు సారధి. అతని తల్లి చిన్నప్పుడే చనిపోయింది. కలిమి లేములు ఆ హృదయాల మధ్య అడ్డు పొరలు వేయలేదు. వాళ్ళిద్దరూ చిన్న తనంనుండి గుజ్జెనగూళ్ళు, బొమ్మల పెండ్లాటలు ఆడుకున్నారు. అనురాగంతో పాటు, ఆ యిండ్లలో మల్లె, జాజి, మాలతీలతల్ని పాతి యెంతో శ్రద్ధగా పెంచారు.

చురుకైన సారధికి అన్నిట్లోనూ ఫస్టు మార్కులే. ఎమ్. ఎ. చదవడా నికి విశాఖపట్నం వెళ్ళిపోతే, యిద్దరి మధ్య ఉత్తరాలే వాళ్ళ మూగభాషను అనువదించేవి. అప్పుడప్పుడు యింటికి వచ్చేవాడు. ఆ రోజు సూర్యజయంతి. సువర్ణాలంకారాలతో సూర్యదేవుడు కోటి ప్రభ లీనుతున్నాడు.

"ఏం కోరుకున్నావు కమలా?" దైవ దర్శనం తర్వాత సారధి ప్రశ్న.

"సారధి అనే కొంటెబ్బాయి కలక్టరు కావాలని".

"అతను నీకేమీ కాడా!"

యిద్దరూ నవ్వుకున్నారు. ఆ రాత్రి సూర్యదేవుని ఏకాంత సేవ.

"యింత చక్కని దేవుడు ఎవరోయమ్మా....

ఇతడెవరోయమ్మా....

జగమంతా బ్రోచు నారాయణుడే కామ్మా...."

అన్న సేవల పాటతో ప్రారంభ మయింది. ఛాయా సూర్యుల సంవాదం, రాగానురాగాలమధ్య జీవన ప్రవంతిలా వారి హృదయాల్లో ఆనందపు జల్లు కురిపించింది. ఊళ్ళో అందరికీ తెలుసు వారిద్దరూ కాబోయే భార్యాభర్తలని. వారి యిష్టమయ్యే సంగతౌకటుంది. అది సూర్యదేవుని తెప్ప తిరునాళ్ళ

సూర్య పుష్కరిణిలో కమల ఆరుద్ర పురుగురంగు ధర్మవరం పట్టు చీర కట్టుకుని, కమలాఫలం దొప్పల్లో నేతి దీపం పెట్టి నీళ్ళమధ్య వదిలి, గట్టుమీద కూర్చుని అలలమీద ఆ కార్తిక దీపాల ప్రయాణాన్ని, మెరిసే కళ్ళతో తన్మయొరాలై చూస్తుంటే, అలాంటి అందాల తీగ సరసన ఆమెతో ఆనందం పంచుకోవటంలో ప్రతీ సంవత్సరం సారధికి తృప్తి లభిస్తుండేది.

'ఈ దీపాలు యెక్కడికి ప్రయా ణిస్తాయి.'

"అవతలి ఒడ్డుకు...."

"యెందుకు ఈ కార్తికదీపాలు వెలిగించాలి కమలా...." కమల మనస్సులో యెక్కడా శూన్యం వుండేది కాదు. అంతా అనురాగమయం.

"ఆ నీటిమీద అలలు జీవనతరంగాలు. ఈ కమలా ఫలం మనస్సు; అందులో

నెయ్యి అనురాగం. అది కరగదీసుకుని వెలిగేది సృష్టి రహస్యానికి ప్రాణం పోసే కోరిక. అందువల్ల ప్రేమ జీవులు రాగమయ జీవితాన్ని కోరికల దీపాల వెలిగించి....” యింక కమల చెప్పలేకపోయింది. ఆమె సోగ కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. అప్రయత్నం గానే తన్మయత్వంలో ఆమె నుదుటిని ముద్దుపెట్టుకున్నాడు.

ఆ మరుసటి సంవత్సరం సారధి విశాఖలో వున్నపుడు, యెవరో జ్యోతిష్కుడు సారధి కెంపు వుంగరం పెట్టుకుంటే అదృష్టవంతు డవుతాడని చెబితే తాను దాచుకున్న డబ్బుతో ఖరీదైన కెంపుకొని వుంగరం తయారు చేయిస్తున్నానని, తెప్పతిరునాళ్ళకి తప్పకుండా రావల్సిందని రాసింది.

కానీ ఆ వుంగరం అతని వేలికి తొడగబడలేదు. కారణం ఏకాకి జీవితం గడుపుతున్న తండ్రి జాతికాని జాతి మనిషిని పెండ్లిచేసుకున్నాడని, అందువలన జాతిభ్రష్టుడైన వాడి కొడుక్కి కమలతండ్రి యివ్వనని చెప్పేశాడు. కమలని పిలిపించి తనముందు అడగమన్నాడు. తన శరీరంలో ప్రతి అణువు ఆక్రమించిన కమల, తను లేకపోతే బ్రతకలేనన్న కమల, ఆ తల్లిదండ్రుల మమతానుబంధాల్ని విడదీసుకోలేకపోయింది.

చిలుకు ద్వాదశినాడు తెప్ప తిరునాళ్ళ పండగయిపోయింది. సూర్య పుష్కరిణి నిశ్శబ్దమైపోయింది. అంతా చీకటిగా వుంది. దూరంగా పొలాల్లో నక్కల కూతలు వికృతంగా వినిపిస్తున్నాయి. అక్కడక్కడా రెండో మూడో కార్తీక దీపాలు, అగుతూ వూగుతూ ప్రయాణిస్తున్నాయి. అవి గమ్యం చేరుకోకుండా రివటలు వేస్తున్న చలిగాలికి విస్సహాయంగా ఆరిపోతున్నాయి.

వృద్ధాప్యంలో, తోడుకోసం అలమటించిన తండ్రి చేసిన పనిని కాదనలేకపోయాడు. అంతే! అవమానం భరించలేక, అన్ని ఆశయాలకు, దీక్షలకు తిలోదకాలు వదిలి, తెగిన గాలిపటమైపోయాడు.

* * *

నిశ్శబ్దంగా విన్న శ్రోత ఆశ్చర్యపోయింది. భర్త హృదయంలో అగ్ని పర్వతం బ్రద్దలైంది. అది ప్రవహిస్తోంది.

“యిప్పుడు చెప్పు. యివాళ యీ నా దారిద్రానికీ, యీ దుస్థితికి ఆమే కారణం....నా గౌరవంకోసం, ఆనాడు యేమాత్రం తెగించినా, నా ఈ జీవితంలో నేను ఆశించిన గమ్యస్థానాన్ని చేరుకునే వాడిని. కానీ యిప్పుడు....” సారధి మరి మాట్లాడలేకపోయాడు.

మౌనంగానే కన్నీరు తుడిచింది.

“స్త్రీకి మగవాడికున్నంత ధైర్యం వుండదండి. అందులోనూ తల్లీ తండ్రీ

చాటున పెరిగిన ఆడపిల్లకు అంత ధైర్యం యెలా వస్తుందండి....”

“ప్రేమించడానికి ధైర్యం ఉంది. నాలో ఆశలు రేపడానికి ధైర్యం వుంది, మా జీవితాలు సుఖమయం కావడానికి కార్తీకదీపాలు వెలిగించడానికి ధైర్యం ఉంది. కానీ నాకోసం ఆ యింటిని వదిలి రాలేకపోయింది కదూ....” చిన్న పిల్లాడిలాగే అన్నాడు.

“యిప్పుడు ఆమె గురించి తప్పులు పట్టి ఆమెను అవమానపరచడం బాగుండదండి. దానివల్ల మన కొరిగేదేమీ లేదు. జీవితం వేరు, బ్రతుకు వేరు: యివాళ ఆమె జీవితం చాలా అస్తవ్యస్తమైన పరిస్థితిలో వుంది. దయచేసి ఆవేశపడక నన్ను అర్థంచేసుకోండి. వింటున్నారా.”

“ఆ....” అన్నాడు బయట ఆకాశంలో నక్షత్రాలకేసి చూస్తూ.

“జీవితంలో ప్రతి స్త్రీ కోరుకునేది సౌభాగ్యం, మాతృత్వం....దురదృష్ట వశాత్తూ ఆమెకు ఆ రెండూ కరువు అయ్యాయి. ఆమె యివాళ మన ఇంటి గుమ్మంలో దేహీ అని యాచన కొచ్చింది. దీనంగా చేతులు పట్టుకుని అర్థించింది....”

“ఆమె కోరిక నేను తీర్చలేను. జీవితంలో చివరి రక్తపుబొట్టును గూడా స్వేదజలంగా మార్చి, నా బిడ్డల్ని అభివృద్ధిలోకి తెస్తాను....అంతేగానీ.... వాణ్ని కన్న తల్లిగా నీ వాలోచించు....” అన్నాడు.


“యే కన్నతల్లీ తన బిడ్డల్ని పెంపకం యివ్వడానికి వొప్పుకోదండీ, ముష్టెత్తయినా బిడ్డల్ని పెంచడానికి తాపత్రయపడుతుంది..కానీ....కానీ....” చెప్పలేకపోయింది.

“ఊ....కానీ....ఏమిటా సంశయం చెప్పు....” ఆమె ముఖంలోకి చూస్తూ మొండిధైర్యం తెచ్చుకుంది కాంత.

“మీరోసారి ఆ మొక్కల్ని చూడండి. వాటికేం లోటుచేసామని అవి సమంగా పెరగటంలేదు నీరు పోస్తున్నా. వున్నంతలో శాయశక్తులా శ్రమిస్తున్నా, అవి ఏపుగా పెరగాలని శతప్రయత్నాలు చేస్తున్నాను. కానీ ఫలితం లేకపోతోంది. వాటికి మంచి నీరు, వెలుతురూ మంచి మన్నూ ఇలాంటివెన్నో కావాలి.అలాంటి అవకాశం వచ్చినప్పుడు వాటి అభివృద్ధికి మనం దోహదం చెయ్యాలి, ఏమంటారు.”

“నిజమే. నువ్వు పోసే ఈ వుప్పు నీళ్ళతో అవి ఎలా పెరుగుతాయి....”

“మీ రొక్కసారి ఆలోచించండి. ఆమె పిల్లడ్ని దత్తత అడగటంలేదు. పెంపకానికి అడుగుతోంది. ఆమెకు యెవ్వరూ దొరక్క ఇక్కడికి రాలేదు. కంటిలో పాపలా చక్కగా సాకి విద్యా బుద్ధులు నేర్పుతానంటోంది. మొక్క లాంటి మన బిడ్డ, అభివృద్ధిచెందడానికి తగిన చక్కని అవకాశం లభిస్తోంది.




మనకు ఆమెమీద ఉండే ద్వేషాలకూ, దురభిమానాలకూ, సెంటిమెంట్లకూ బిడ్డడి భవిష్యత్తును బలిచేయవద్దు. ఆమె మీద ఉండే కోపం స్థానంలో సానుభూతిని ఉంచి ఆలోచించండి. వాటితో పాటు మన పరిస్థితులూ....” శాంత గాద్గదికంగానే భర్తను అభ్యర్థించింది.

“నేనేం ఆలోచించే స్థితిలో లేను శాంతా. నీ నిర్ణయమే నా నిర్ణయం....” అన్నాడు సారథి. ఆ రాత్రి యిద్దరికీ నిద్రలేదు.

* * *

ఆదివారం ఉదయం తొమ్మిదిగంటలు కావస్తోంది. పిల్లలకు చదువు చెప్తున్న సారథి తలెత్తి చూసేసరికి యెదురుగా కమల. లోపలికి డ్రైవరు ప్యాక్‌చేసిన అట్టపెట్టెల్ని నేలమీద పెట్టాడు.

యెదురుగా సారథి....కమలలు. కలెక్టరు కావాలని సారథి క్లర్కు జీవితంతో కుస్తీ పడుతున్నాడు తలలో అక్కడక్కడ అనుభవాలు పండినట్లు జుత్తు నెరసింది. శాంత వంటింట్లో వంట ప్రయత్నంలో వుంది. పన్నని నేత చీరలో, మెరుపులా, సౌమ్యమూర్తిలా మెరిసిపోతోంది కమల.

“రా. కూర్చో! శాంతా ఆమె వచ్చింది.” అంటూ దృష్టి మరల్చాడు.

“రా అక్కా, కూర్చో....” అంది శాంత, కాఫీ రెండు కప్పులతో తెస్తూ.

“యివి తీసుకో చెల్లీ” అంటూ చీరల ప్యాకెట్లు అందించింది.

“యెందుకక్కా యివన్నీ....”

“యేదో చెల్లీ నా సంతోషంకోసం”

అంటూ పిల్లలకు స్వీటు పేకెట్లు తీసిచ్చింది.

"కాఫీ తీసుకో అక్కా, చల్లారి పోతుంది," అంది లోపలికి వెడుతూ. సారథి, కమలా కాఫీ త్రాగుతున్నారు. అరసవెల్లిలో ఒకే గ్లాసుతో యిద్దరూ త్రాగేవారు. ఆ దృశ్యం అతని హృదయంలో తళుక్కుమంది.

"చెల్లి చెప్పిందనుకుంటాను...."

"అవును చెప్పింది. ఆమె యిష్టమే నా యిష్టం...."

శాంత చెంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

"నీకు వీళ్ళ ముగ్గుర్లో యెవరు కావాలి అక్కా...."

పిల్లల కిదేం అర్థంకాక చిత్రంగా చూస్తున్నారు.

"మీ దంపతుల యిష్టం చెల్లీ. యెవరైనా నాకు ఒకటే...." అంది ఆశగా.

"పోనీ వీళ్ళనే అడుగు. ఎవరొస్తారో వాళ్ళనే తీసికెళ్ళు...." అంది నవ్వి.

"ఒరే బాబూ! నాతో యెవరు మా వూరు వస్తార్రా," అని అడిగేటప్పటికి చిన్నవాడు రవి తల్లి కొంగు పట్టుకున్నాడు.

"నేను వొస్తాను...." అన్నాడు పాణి అమాయకంగా.

కమల తటాలున వాణ్ణి దగ్గరకు తీసుకుని ముద్దులాడింది.

శాంత హృదయంలో ఆవేదనను అణుచుకుంది. వాడొక్క క్షణం అకలికి అగలేడు. వాడి పసి హృదయంలో యెన్నో కోర్కెలు. అన్నీ కమల తీర్చగలదు. చక్కగా తీర్చిదిద్దగలదు.

"యివాల్టికి నా జీవితం ధన్యమైంది. మీ దంపతులకు యావజ్జీవితం ఋణపడి ఉంటాను. సాయంకాలం ప్రయాణం. యీలోగా నేను కొంచెం పనులు చూసుకొని వస్తాను. వీణ్ణి తీసుకెడుదునా!" సారథివైపు చూస్తూనే అడిగింది.

"యీ పూట యిక్కడ భోజనం చేయక్కా, సాయంకాలంవరకూ వీణ్ణి ఉండనీ...." అంటూనే దగ్గరకు తీసుకుంది.

"లేదు చెల్లీ. నేను ఒక పనికోసం యిక్కడకు వొచ్చాను. అందులో పడి, మాకు తెలిసిన బంధువులింట యింత వరకూ భోజనం చేయలేదు. అందుకని అక్కడ భోజనం చేయాలి. భోజనంకేం ఇంక రానా....పోనా...."

"సరే నీ ఇష్టం...." అంది.

"యిది నా గురుతుగా నీ మెళ్ళో వుండనీ" అంటూ హేండ్ బేగ్‌లో నాలుగు పేటల బంగారు గొలుసుల హారం తీసి శాంత మెడలో వేసింది.

"క్షమించక్కా! నీ యీ కోరికను కాదన్నందుకు" అంటూనే మృదువుగా ఆ హారాన్ని ఆమె కిచ్చేసింది. సారథి పొంగిపోయాడు శాంత ప్రవర్తనకు

మనస్సులోనే. కమలకు నోట మాట రాలేదు. నిశ్శబ్దంగానే నడచింది.

"యేమండీ పాణికి కొబ్బరుండలంటే యిష్టమండీ, రెండు కొబ్బరి కాయలూ, మంచిబెల్లం పట్టండి. అన్నట్టు షీకాయ పొడి గూడ పట్టండి. వాడికి తలంటు తాను" అంటూ సారధిని హెచ్చరించింది,

సాయంకాలమైంది రైల్వే ప్లాట్ ఫారం లైట్ల కాంతిలో అద్భుతంగా మెరుస్తోంది. ఫస్ట్ క్లాస్ కుపేలో పాణి కూర్చున్నాడు. కార్లో రావటం యివన్నీ వాడికి అపురూపంగా వున్నాయి. కమల విండో దగ్గర కూర్చుంది. శాంత రాలేక పోయింది. పాణిని విడువలేక విడువ లేక విడిచింది. కమలకు వాడి గురించి యెన్నో జాగ్రత్తలు చెప్పింది. వాడు తినగా మిగిలిన కొబ్బరుండల్ని పొట్లాం కట్టి యిచ్చింది. కోలాహలంగా వుంది స్టేషను. వాళ్ళిద్దరి మధ్య నిశ్శబ్దం.

"మళ్ళా మిమ్మల్ని జీవితంలో కలుస్తా ననుకోలేదు...." అంది గాద్గదికంగా. సారధి మాట్లాడలేదు.

"మీ ఆఫీసువాళ్ళు సమర్పించిన కార్మికుల కార్యక్రమంలో కార్తీక దీపాల కథ విని మీరిక్కడ వున్నారని తెలుసుకుని వచ్చాను...." అంది సారధి కనుల్లోకి చూస్తూ. ఆ మాటకు సమాధానం యివ్వకుండానే బుక్‌స్టాల్‌లోకి వెళ్ళి పుస్తకాలు కొని యిచ్చాడు.

"యెందుకివన్నీ. యిప్పుడు వీటి అవసరం యింకలేదు. నాకు కాలక్షేపానికి బాబు వున్నాడు...." అంది నవ్వి తీసుకుంటూ.

మైకులో ఎనౌన్సుమెంటు జరుగుతోంది. గార్డు విజిల్ వేసాడు. రైలు కదిలింది. యేదో గుర్తుకు వచ్చినట్లుగా కవరు తీసి సారధికిచ్చింది.

"యేమిటిది...." అడిగాడు.

"డబ్బు మాత్రం కాదు, తరువాత తీరిగ్గా ...."

మరి ఆమె మాటలు చీకటి కోయడానికి రైలు వేగం పుంజుకుని చేస్తున్న శబ్దంలో వినిపించలేదు. అక్కడే చింపాడు కవర్ని.

బరువైన గుండెలతోనే యింటికి చేరే సరికి, శాంత కళ్ళలో వత్తులు వేసుకుని యెదురు చూస్తోంది.

"ఏమండీ వాళ్ళు వెళ్ళిపోయారా...." గాద్గదికమైన స్వరంతో అడిగింది.

"ఆ! వెళ్ళిపోయారు శాంతా...." అంటూనే కవరూ, ఉత్తరం యిచ్చాడు.

"బావా!

నామీద కోపంతో ఈ ఉత్తరం చింపేయకు.

జీవితంలో యేమాత్రం కొంచెం ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నా, విధి మానవ జీవితాన్ని యెన్ని చిత్రహింసలు చేస్తుందో!

ఆరాత్రి నిన్ననుసరించలేకపోయాను. కారణం నా పిరికితనం కాదు. నీ ధ్యేయమయమైన జీవితాన్ని సర్వనాశనం కావడాన్ని యిష్టంలేక, ఆ తర్వాత మొండి ధైర్యంతో నిన్ననుసరించుదామంటే యెక్కడున్నావో తెలియదు.

నీ జీవితం యిలా అవడానికి కారణం నేను. ఎంత బాధపడ్డానో నీకెలా తెలుస్తుంది. స్త్రీ జీవితంలో ఒక్కర్నే మనసారా ప్రేమించగలదన్న సత్యం నీకెలా తెలుస్తుంది. నేను జీవితంలో భర్తను పోగొట్టుకోలేదు. కారణం నీ నుండి నన్ను నా మనసుని వేరుచేసుకోలేక పెండ్లి చేసుకోలేదు. ఈ నిజం ముందే చెబితే పరిణామాలు యెలా వుంటాయో నన్న భయంతో శాంతకు చెప్పలేకపోయాను.

సద్గతులకోసం జీవితాన్ని సద్గమయం చేసుకోవటంకోసం, సూర్య పుష్కరిణిలో కార్తీకదీపాలు నీ సరసన వెలిగించాను. ఆ పుణ్యమే నాకీనాడు మిగిలింది.

నా చీకటి జీవితంలో శాంత కార్తీక దీపం వెలిగించింది. ఆ దీపాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటాను. అందులో నీ వెలుగును చూసుకుంటాను.

ఈ శేష జీవితానికి మిగిలిన వొకే వొక కోరిక అనాడు నీకోసం చేయించిన కెంపు ఉంగరం....

నీ కమల,

ఉత్తరం చదివిన శాంత కళ్ళు చెమ్మగిల్లాయి. మౌనంగా ఆ కవర్లో మెరుస్తున్న కెంపు ఉంగరం భర్త వేలికి తొడిగింది. భర్తవేపు ఆప్యాయంగా చూసింది కాని సారధి చూపులు ఆ వుంగరంమీద లేవు. కార్తీక దీపాల్లాంటి జీవితాల్ని గురించి ఆలోచిస్తూ ఆకాశంకేసి చూస్తున్నాడు అక్కడ వెన్నెల వెలుగులో మిలమిల మెరుస్తున్న నక్షత్రాలు కనిపించాయి సారధికి.

